# సంస్కారంలేని సంసారం.....

రచన :
— పసుపులేటి శేషరంగారావు —

సముద్రం ఘోషపెడుతోంది. అలలు పెద్ద శబ్దం చేసుకుంటూ ఒడ్డుకుతాకి విరిగి ముక్కలై పోతున్నై. నారాయణ హృదయంలోకూడా ఓ పెద్దసముద్రం గోషపెడుతూంది. అలల్లాగనే ఆలోచనలు ఒకదాని వెనుక ఒకటివచ్చి మనస్సుకు తగిలి ముక్కలౌతున్నై. సముద్రతరంగాలవలెనే అంతులేని ఆలోచనలు అతని మనస్సులో ముందుకు వస్తున్నై.

అతనికి జీవితంపై అదోవిధమైన విరక్తి పుట్టేలా కనుపిస్తోంది. జీవితంపై విరక్తి పుట్టడానికి అతడు ముసలివాడుకాడు, ఇరవైమూడేండ్ల యువకుడు. ఐనా అతనికి విరక్తి పుట్టేలా ఉంది. స్వార్థలోకంపై అతనికి అసహ్యం పుడుతోంది. లోకం ఇంత స్వార్థపూరితమైందని యిప్పుడిప్పుడే తెలుసుకుంటున్నాడతను. మొన్నమొన్నటివరకూ, అంటే అతను కాలేజీ విడిచిపెట్టక పూర్వంవరకూ దేశం ఎంతోముందుకు పోయిందనుకున్నాడు. అందరూ తనలా నవ్యభావాలు కలవాళ్లేననుకున్నాడు. కానీ జీవితంలో ప్రవేశించబోయే ఈ రోజుల్లోనే తెలుసుకోగలిగాడు దేశం యింకా ఎంతో వెనుకబడే ఉందనీ, ఇంకా కొందరిలో 'ఇంగువకట్టిన గుడ్డలా' ఆ పాతవాసనలు పోలేదని.

లోకబాంధవుడు తన అరుణారుణ కిరణాలు వెదజల్లి నెమ్మదినెమ్మదిగా సంధ్యాప్రేయసి కౌగిటిలోకి జారుకున్నాడు. యామినీ ప్రియుడు అప్పుడప్పుడే తన ఉనికి రూపిస్తున్నాడు. బీచిలో ఒక్కొక్కళ్ళు జారుకుంటున్నారు. ఇంచుమించూ అంతా వెళ్ళిపోయినట్లే. కానీ నారాయణ కదల్లేదు. కదలాలనికూడాలేదు. "తను యిప్పుడు యింటికి వెళ్ళటమా? మానటమా" అదే సమస్యై కూర్చుంది. ఇంటికి వెళ్ళటంతోటే పోరు తప్పదు. ఇటు తల్లి, అటు తండ్రి, మరోవైపు చెల్లెలు లంకించుకుంటారు. తిట్టితిట్టి వారికళ తీరేదాకా పురెక్కిస్తారు. భోజనం చేసినంతసేపు మంగళ హారతులు పడతారు. అంతసేపూ అతనికి బల్లాలుపెట్టి పొడిచినట్లు, శరీరమంతా తేళ్ళు, జెఱ్ఱులు పాకినట్లుగా ఉంటుంది. ఇలా వారం రోజులనుంచీ అవస్థ పడుతున్నాడు. అది రోజురోజుకూ ఎక్కువై పోతోంది. ఇంక సహించలేడు. తాను భరించలేడు. ఏదోఒకటి తేల్చుకోవాలి; 'తల్లిదండ్రుల యిష్ట ప్రకారం ఉద్యోగంలో వెంటనే చేరిపోవటం, లేకపోతే ఈ మూడురోజులూ యింటి ముఖం త్రొక్కకుండా ఉండటం. ఏదో ఒకటి తేలవలసిందే.

తను చూస్తూచూస్తూ స్నేహితుడికి అపకారం చెయ్యలేడు. అతను కోరింది మాత్రం ఏమంత పెద్దకోరిక గనుక; "నేను నిన్న 20 తారీఖునే రిలీజుచేస్తే నాకు పూర్తి నెల జీతం యివ్వరు. అందుకు నేను చాలా తంటాలు పడవలసి ఉంటుంది. ఈ పదిరోజులూ ఆగి ఒకటో తారీఖున చేరుదువుగాని" అని. అంతే స్నేహితుడు నోరుతెరిచి అడిగితే తను కాదనలేకపోయాడు. అప్పుడే వారంరోజులు గడిచాయికూడా. ఈ మూడురోజులకు తను తొందరపడి ఉద్యోగంలో జేరిపోతే తన్ను రిలీజుచేసిన స్నేహితునికి (అతడు శలవులో పోతున్నాడు గనుక) పూర్తిజీతం ముట్టదు. దానికోసం అతడు చాలా శ్రమపడి ఉంటాడు. అదిగాక ఈ మూడు రోజుల్లో తను చార్జితీసుకొని బావుకునేది ఏముంది గనుక. ఎలాగైనా స్నేహితునికి అపకారం చేయలేడు.

మరి...యింటికి వెళితే? తండ్రి సింహంలా గర్జిస్తాడు. "ఆఫీసుకు పొమ్మంటే ఊరంతా చక్కర్లు కొట్టికొట్టి యిప్పుడు కొంపకు జేరావా? నీకు సిగ్గందుకు లేదు? రోజుకు రెండున్నర రూపాయలు వెక్కసమై పోయిందేం? తెచ్చి పడేసేవాడుంటే తినేవాడికేంతెలుస్తుంది? ఎవడో స్నేహితుడట, స్నేహితుడు. వాడికేం పొలాలు, పుట్ర ఉన్నై. నీకేమున్నై. చిప్ప, జోలె..." ఇదే ధోరణి. దానికితోడు మరో ప్రక్క అమ్మ అందుకుంటుంది. అతనిబుఱ్ఱ తిరిగిపోయింది. అసలు ఆ రిలీజుచేసే వ్యక్తి స్నేహితుడు కావటం వచ్చింది యింతచిక్కు. పోనీ పరిస్థితి అతనితో చెప్పేద్దామా అంటే అతనెంత నొచ్చుకుంటాడో. అడకత్తెరనబడ్డ వక్కలా ఉంది నారాయణ స్థితి. మరి యింటికిపోక ఈ మూడురోజులూ తనెక్కడ ఉండగలడు, స్నేహితుడు ఆదరిస్తాడు... కానీ...కారణం ఏం చెపుతాడు? నారాయణ మనస్సంతా వికలమైపోయింది ఆలోచనలతో. జ్వరం వచ్చినట్లయింది. సముద్రం గాలి చల్లగా వీచింది.

ఒక్కసారి బాహ్యప్రపంచంలోపడి మెల్లగా లేచాడు. అనుకోకుండానే అతనికాళ్ళు అలవాటుప్రకారం యింటివేపు లాక్కుపోతున్నై. పిల్లిలా గుమ్మం మెట్లెక్కాడు. తను లోపలికి రావటం అందరూ చూచారు. మొదట ఎవ్వరూ మాట్లాడలా. చాలా గంభీరంగా ఉన్నారు. తన గదిలోపోయి కూర్చున్నాడు. గంభీరంగా ఉండిఉండి ఎప్పుడో ఒకప్పుడు అగ్నిపర్వతం పొంగుతుందని తనకు తెలుసు. ఆ ప్రవాహానికి ఎదురీదాలనుకున్నాడు. స్థిరచిత్తంతో కూర్చున్నాడు.

"అన్నం వడ్డించాం, లే" అంది అమ్మ. మెల్లిగావెళ్ళి కాళ్ళు కడుక్కున్నాడు. పీటమీద కూర్చొని భోజనానికి ఉపక్రమించాడు. అమ్మ నోటిద్వారానే చిచ్చంటుకుంది. తనభోజన మయ్యేసరికి అది పెరిగి పెద్దదై నాలుగుచెరగులా పాకి పెద్దమంటగా మారి నాలుకలు చీల్చుకుంటూ తనమీదకు వస్తానంటూంది. తండ్రి గర్జిస్తున్నాడు. తల్లి తాళం వేస్తోంది. చెల్లెలుకూడా వాళ్లల్లోనే జేరింది.

గబగబా తనగదిలోకి వెళ్ళి తలుపులు వేసుకున్నాడు. అద్దాన్ని చీల్చుకవచ్చే వేడిలా బయటనుంచి ఒచ్చే సూలాల్లాంటి మాటలు తలుపులు చీల్చుకవచ్చి గుండెల్లో నాటుకపోతున్నై. ఆలోచిస్తూనే పడుకున్నాడు. జీవితం అతనికి వింతగా తోచింది. తను ఇంతవరకూ విద్యార్థి కాబట్టి యిటువంటి సమస్యల్ని ఎదుర్కొనే అవసరం లేకపోయింది. ఇప్పుడు అకస్మాత్తుగా వీటిని ఎదుర్కో-

వలసి వచ్చేసరికి మెట్లులేని కొండెక్కటమే ఐంది. ఆరాత్రి అతనికి నిద్రే పట్టలేదు.

ఆ మరుచటి ఉదయం అతనికి మంగళ హారతులతోనే ప్రారంభమైంది. నరకమంటే యిదేనేమో ననిపించింది. "గృహము కంటె ను సౌఖ్యంబు మహినిగలదె" అనే మధుర కవి వాక్యం అబద్ధమేమో ననిపించింది ఆ క్షణానికి. తండ్రీ రంకెలు వేస్తున్నాడు. "వెధవ! నిన్న ఆఫీసుకు వెళ్లమంటే కడుపు నిండా తిని ఊరంతా తిరిగితిరిగి కొంపకు చేరుకున్నాడు. వారంరోజులబట్టీ ఎందుకెందుకని ఊరుకుంటున్నాను. ఈరోజు ఆఫీసుకు వెళ్ళనంటే అన్నం పెట్టకండి. ఏ స్నేహితుడు పెడతాడో చూస్తాను. ఉద్యోగాల్లేక, దొరక్క ఎంతోమంది ఏడుస్తూంటే ఉద్యోగమిప్పించి ఆఫీసుకెళ్లరా అంటే వీడికి వెక్కసమైందీ? చూస్తాను; ఆఫీసుకెందుకెళ్ళడో, వెళ్ళకపోతే తిండి ఎవడు పెడతాడో?"

అటు అమ్మ "ఒరేయ్ నిన్నటినుంచీ మీ నాన్న నీమీద మరీ మండిపడిపోతున్నారురా ఇంట్లో కసలు రానీయొద్దన్నారు. ఏం? రోజుకు రెండున్నర రూపాయలు వెక్కసమట్రా?" "మూడురోజులే కదూ?" అంటావ్. మూడురోజులకు పది రూపాయలు రావటంలా? చూస్తూచూస్తూ ఎవడికోసమో పదిరూపాయలు వదులుకుంటామా? తొందరగా భోంచేసి ఆఫీసుకెళ్ళు. ఎలాగా ఇవాళ్ల నిన్నొదలరు మీనాన్న, వెంబటిపెట్టి తీసుకవెళ్లయినా ఆఫీసులో జేరుస్తారులే. ఊళ్ళో తిరగటానికి నీకేం సిగ్గేయటంలా?"

అటు చెల్లి "ఇలా ఎన్నిరోజులు తిట్లు తింటావన్నాయ్. ఆఫీసులో చేరిపోదూ స్నేహంమాట తర్వాత చూసుకుందాం. అతని తిప్పలు అతడు పడతాడులే..."

ఈ వరసలో సాగిపోతున్నై కుండలోని ద్రవం సలసలా మరగటానికి పొయ్యి క్రింద కట్టె లెగదోసినట్లు. ఒక్కొక్కరి మాటా తనలో మండే అగ్నిజ్వాలకి ఒక్కొక్క యింధనంలా పనిచేస్తున్నై. తన మెదడు అప్పటికే మరిగిపోయింది. ఇక ఆవిరి ఐపోతుందేమో ననిపిస్తూంది. ఏదో పనిమీద శేషు (మరొక స్నేహితుడు) వచ్చాడు. తనమీద పనిజేసే యింజన్ల ఉధృతంచూసి, ఆగలేక కాబోలు మాట్లాడకుండానే వెళ్ళిపోయాడు.

తన తల తీసేసినట్లయింది. డిగ్రీ పుచ్చుకున్న తన్ను ఒక హైస్కూలు కుఱ్ఱాడికన్నా అన్యాయంచేసి తిట్టిపోస్తూంటే యిక సహించలేకపోయాడు. తనలో సహనం అనేది ఏమైనావుంటే ఈ వేడికి అది యిదివరకే కరిగిపోయింది. అతనికాళ్ళు పరుగులాంటి వేగంతో ఆఫీసువేపు నడిచినై. ఈ వేగంలో అతనికి భోజనంచేయని సంగతికూడా జ్ఞాపకానికి రాలా. చెయ్యి జేబులోకివెళ్ళి ఆర్డరుకాగితం తీసి చూపించింది. ఆఫీసరు అతనికి నిర్దేశించబడిన సీటు చూపించాడు......అంతే, ఆ రోజునించి నారాయణకూడా ఒక ఉద్యోగి అయ్యాడు. కానీ నారాయణమాత్రం యిప్పటికీ అప్పుడప్పుడూ అనుకుంటాడు "మాతండ్రి ఏమాత్రం సంస్కారమున్నా తన ఉద్యోగం పట్ల అంత అమానుషంగా ప్రవర్తిస్తాడా?" అని.

# కాలచక్రం

రచన: ఎన్. వి. ఆర్. పట్నాయక్

*

కాలాలు మారాయి
కరవులా పెరిగాయి
ఉన్నవారలకెల్ల
ఉల్లాసమైపోయె
లేనివారలకెల్ల
లేకుండపోవగా
కరవు పెరగుటలోన
కష్టమేముంది.

*  *  *

మాటతీపులచేత
మనుజులను వంచించి
పదవులను పొందారు
ప్రజలలో కొందరు
కార్యరంగమునందు
కాలుచేయాడకా
తనకు నిలిపినవాని
తనకుతోడగువాని
తలచారు నేడాట.
తేనెపలుకులతోడ
తనవారి నేవంచి
పైసాను చేర్చారు
మనలోనె కొందరు
ధరను పెంచీజగతి
ధర్మమును వదలేశి
కరవురాక్షసికాత్మ
బందులై వెలగారు.

*  *  *

చిన్నవారలకిచ్చు
చినచిన్న లంచాలు
లంచాలరూపులో
సంచారములుచేసె
పెద్దవారలకిచ్చు
పెదపెద్ద మొత్తాలు
చాటుమాటుగనైన
చెవులసోకినతోడె
కానుకల్ రూపులో
కండ్లదుమ్ము నుకొట్టె.
లంచమంటేయేమొ
కానుకంటేయేమొ
లంచాలు కానుకగ
లావయిపోగానే
చిన్నవారలకిపుడు
చూచువారెవ్వరు
పెద్దవారెల్లరు
మిత్రులైపోగానె
కరువు పెరుగుటలోన
కష్టమేముంది.

*  *  *

జీతాలు చాలవను
రోతతో సంఘాలు
పంటపోయిందంచు
కంటనీటితోరైతు
డబ్బుచాలదటంచు
దుఃఖించు యజమాన్లు
అధికార్ల వంచించి
అదనముగ ధరపెంచి
నష్టమంచునెయుండ
నల్లబజారీకులు
కలిగియుండగమనకు
కరవుకేలోటుంద.

*  *  *

పదవికలిగినతోడ
ప్రభులతో ఒకటయి
ప్రభులు తనవారైన
ప్రజల వంచించుచూ
తనకోస మీజగతి
తనవార లీజనులంచు
ఎరువునాయకులుండ
కరువుకేలోటుంద.

*  *  *

ప్రజలఎన్నికులేను
ప్రభువులవునప్పుడూ
ప్రజలకోర్కులనె, పాటించనపుడు
ప్రజలు ప్రభులనుకూడ
ప్రాజ్ఞులౌనప్పుడూ
ప్రజలదేశమెయంచు
పాటుపడునప్పుడూ
కరవురూపమె మనకు
కరువయిపోవదా.